## ఒకచోట చేరి.. ఒకరికి ఒకరుగా..

ప్రధానంగా ఒక కాలనీ, అపార్ట్‌మెంట్ లేదా సొసైటీలోని 10 నుంచి 20 కుటుంబాలకు చెందిన మహిళలు కలిసి కిట్టీ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతి నెలా ఒక్కొక్కరు నిర్ణీత మొత్తాన్ని చిట్టీ రూపంలో జమ చేస్తారు. సాధారణంగా రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. నెల మొదటి వారంలో అందరూ కలిసి డ్రా నిర్వహించి, ఆ నెలలో ఒకరికి మొత్తం అందజేస్తారు. డబ్బులు అందుకున్న కుటుంబం తదుపరి నెల కిట్టీ పార్టీకి ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ఇలా నెలనెలా ఒక కుటుంబానికి మొత్తం అందుతుండటంతో చిన్నచిన్న ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఈ చిట్టీ కొంత వెసులుబాటును కల్పిస్తోంది. ఇంటి అవసరాలు, పిల్లల చదువులు, చిన్నపాటి కొనుగోళ్లు, అత్యవసర ఖర్చులు వంటి వాటికి ఈ మొత్తం ఉపయోగపడుతోంది.


# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 307 | వరంగల్ | శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06




# కిట్టీ.. చిట్టీ..

## మహిళల చిన్న ఆర్థిక స్వరూపం..

### బంధాలను కలిపే పార్టీ.. ఉమ్మడి సరదాలకు చక్కటి వేదిక

కిట్టీ పార్టీ అంటే చాలామందికి గుర్తొచ్చేది మహిళలు ఒకచోట చేరి సరదాగా గడపడం, ఆటలు ఆడటం, ప్రత్యేక వంటకాలు చేసుకోవడం. హైసొసైటీలో కిట్టీ పార్టీ అనేది ఒక సామాజిక హోదాను చాటుకునే వేదికగా కనిపిస్తే.. మధ్యతరగతి కుటుంబాల్లో మాత్రం అది సరదాతో పాటు చిన్నపాటి ఆర్థిక వ్యవస్థగా, బంధాలను బలోపేతం చేసే వేదికగా మారుతోంది. కిట్టీతో పాటు నిర్వహించే చిన్న చిన్న చిట్టీలు కుటుంబాల అవసరాలకు కొంతమేర ఆర్థిక భరోసాను అందిస్తున్నాయి. సరదాగా మొదలైన ఈ కిట్టీలు స్వరూపం మార్చుకొని, ఆర్థిక మానవ సంబంధాల వేదికగా నిలుస్తున్నాయి. ఇప్పుడు నగరంలో అన్ని కాలనీల్లో మహిళా కిట్టీ పార్టీలు సర్వసాధారణం అయ్యాయి. *- అక్షరశక్తి, హనుమకొండ*

3

## చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను
# పకడ్బందీగా చేపట్టాలి

- ప్రతిష్ఠించే విగ్రహాల ఎత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మట్టి విగ్రహాల నిమజ్జనం చాలా సులువు
- తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేయాలి
- వీలైనంత త్వరగా వినాయకులను నిమజ్జనంకి తీసుకరావాలి
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ ఉండేందుకు సహకరించండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- నగరంలోని చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

6



# మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా భాగస్వాములు కావాలి...
- అక్షరశక్తి ఎండీ డాక్టర్ పల్లె రవి వంశీ మోహన్



పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించాలని అక్షరశక్తి ఎండీ డాక్టర్ పల్లె రవి వంశీ వంశీ మోహన్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని ఆయన అన్నారు. *- అక్షరశక్తి, హనుమకొండ*

5




# శ్రావణకు బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్

**జాతీయ ఫోటోగ్రఫీ పోటీ–2026లో శ్రవణ్ తాడన్లకు పురస్కారం**

**అక్షరశక్తి,ములుగు:** జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీ-2026లో ములుగు జిల్లా పాలంపేట (రామప్ప) గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ శ్రవణ్ తాడన్ల ప్రతిభను చాటారు. ఆయన సమర్పించిన ఛాయాచిత్రానికి ప్రతిష్ఠాత్మకమైన "బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్" అవార్డు లభించింది. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (PAI), ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ జాతీయ ఫోటోగ్రఫీ పోటీని నిర్వహించాయి. "My India: 80 Years of Democracy and Freedom" అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీకి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. దేశంలోని 16 రాష్ట్రాల నుంచి 182 మంది ఫోటోగ్రాఫర్లు 352 ఛాయాచిత్రాలను పోటీకి సమర్పించారు. ప్రముఖ జ్యూరీ సభ్యులు ఛాయాచిత్రాలను పరిశీలించి వివిధ విభాగాల్లో మొత్తం 60 అవార్డులను ఎంపిక చేశారు. ఇందులో శ్రవణ్ తాడన్ల సమర్పించిన ఛాయాచిత్రం "బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్" అవార్డుకు ఎంపికైంది. అవార్డు ప్రదానోత్సవం అక్టోబర్ 2న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను విశ్వవిద్యాలయం తరపున గోల్డ్ మెడల్స్‌తో సత్కరించనున్నారు. పాలంపేటకు చెందిన శ్రవణ్ తాడన్ల జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికకావడం పట్ల స్థానికులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

## వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన

- 'వీ వాంట్ జస్టిస్' అంటూ రోడ్డెక్కిన విద్యార్థులు..
- 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు న్యాయం చేయాలంటూ శుక్రవారం నిరసనకు దిగారు. కళాశాల ఎదుట ప్రధాన రహదారిపైకి వచ్చిన విద్యార్థులు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఇప్పటికే ప్రధాన రహదారికి ఇరువైపులా వినాయక విగ్రహాల విక్రయాలు కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. విద్యార్థుల నిరసన కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు.

# పర్యాటక రంగం అభివృద్ధికి మానవుడి ప్రయాణమే మూలం





డాక్టర్ కృష్ణ సుమంత్

**అక్షరశక్తి,హనుమకొండ:** మానవుని మనుగడ, అవసరాలు, ఆనందం కోసం సాగించిన ప్రయాణాలే నేడు పర్యాటక రంగం అభివృద్ధికి మూలంగా నిలిచాయని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ కృష్ణ సుమంత్ అన్నారు. పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శుక్రవారం ఆయన రిసోర్స్ పర్సన్‌గా హాజరై 'గైడింగ్ స్కిల్స్, హెరిటేజ్ ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డిజిటల్ మేనేజ్‌మెంట్' అంశంపై విస్తృతంగా ఉపన్యసించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ సుమంత్ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో మానవులు తమ ఆలోచనలు, జీవన విధానం, సంస్కృతికి అనుగుణంగా సమూహాలుగా ఏర్పడి జీవించారని తెలిపారు. మానవ అవసరాలకు అనుగుణంగా ప్రయాణాలను సులభతరం చేసుకునేందుకు చక్రాన్ని ఆవిష్కరించారని వివరించారు. సంతోషకరమైన, ఆహ్లాదకరమైన జీవనం కోసం మనిషి వివిధ ప్రాంతాలకు ప్రయాణించడం ప్రారంభించాడని చెప్పారు. వర్తక, వ్యాపార అవసరాల కోసం సముద్ర మార్గాల అన్వేషణ జరగడంతో వివిధ ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయని తెలిపారు. నాగరికతలు ప్రధానంగా నదీ పరివాహక ప్రాంతాల్లోనే అభివృద్ధి చెందాయని, ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన మానవ జీవన విధానం, సంస్కృతి ఎంతో విశిష్టమైనదని వివరించారు. దేవాలయ సంస్కృతి ప్రాధాన్యతను వివరిస్తూ దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా మానవ జీవన విధానం, క్రమశిక్షణ, సామాజిక సంబంధాలు, సంస్కృతికి కేంద్రాలుగా నిలిచాయని అన్నారు. వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించడంలో హెరిటేజ్ ఇంటర్‌ప్రిటేషన్, డిజిటల్ మేనేజ్‌మెంట్ కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సును విజయవంతంగా నిర్వహిస్తున్న చరిత్ర విభాగాన్ని, విభాగాధిపతి డాక్టర్ విభాగ శ్రీనివాస్‌ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, సర్టిఫికెట్ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, ఇంగ్లీష్ విభాగాధిపతి పి.డి. సుజాత, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట చరిత్రను దొంగిలించేందుకు బీజేపీ యత్నం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హన్మకొండలో పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ




**అక్షరశక్తి, హనుమకొండ:** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో బాలసముద్రం నుంచి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయుధ పోరాట అమరుడు ధానునాయక్ విగ్రహం వద్ద సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన చారిత్రాత్మక పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమన్నారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో తెలంగాణ ఎర్రబారిందని పేర్కొన్నారు. పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన అంతమైందన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, మూడు వేల గ్రామాలను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. సాయుధ పోరాట చరిత్ర, అమరుల జీవితాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఠాణాలోనే నిప్పంటించుకున్న యువకుడు



**అక్షరశక్తి, వరంగల్:** మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఊహించని ఘటన చోటుచేసుకుంది. కట్ల హర్షిత్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఠాణాలోకి వచ్చి పోలీసుల ఎదుటే నిప్పంటించుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో హర్షిత్‌తో పాటు స్టేషన్ రైటర్ ప్రవీణ్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులను పోలీసులు హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనతో పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబ వివాదాల నేపథ్యంలోనే హర్షిత్ ఈ తీవ్ర నిర్ణయానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. కొంతకాలంగా ఆయనకు భార్యతో కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు సమాచారం.తన బిడ్డను తనకు దూరం చేశారంటూ హర్షిత్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అత్త, భార్య వేధింపుల కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించినట్లు సమాచారం. అయితే ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, కుటుంబ వివాదానికి సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పోగొట్టుకున్న మొబైల్ రికవరీ



**అక్షరశక్తి, హసన్‌పర్తి:** తిరుపతిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ సాంకేతికతతో హసన్‌పర్తి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. మే 30న ఎన్. ప్రశాంత్ తిరుపతిలో తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ఆపరేటర్ ఎం. సోమన్న, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ కె. తిరుపతి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. మొబైల్ తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక చొరవతో దాన్ని కొరియర్ ద్వారా హసన్‌పర్తి స్టేషన్‌కు తెప్పించారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ బాధితుడికి మొబైల్‌ను అందజేశారు. ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులకు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.



# కిట్టీ.. చిట్టీ..

- మహిళల చిన్న ఆర్థిక స్వరూపం..
- బంధాలను కలిపే పార్టీ
- ఉమ్మడి సరదాలకు చక్కటి వేదిక

**అక్షరశక్తి, హనుమకొండ:** కిట్టీ పార్టీ అంటే చాలామందికి గుర్తొచ్చేది మహిళలు ఒకచోట చేరి సరదాగా గడపడం, ఆటలు ఆడటం, ప్రత్యేక వంటకాలు చేసుకోవడం. హైసొసైటీలో కిట్టీ పార్టీ అనేది ఒక సామాజిక హోదాను చాటుకునే వేదికగా కనిపిస్తే.. మధ్యతరగతి కుటుంబాల్లో మాత్రం అది సరదాతో పాటు చిన్నపాటి ఆర్థిక వ్యవస్థగా, బంధాలను బలోపేతం చేసే వేదికగా మారుతోంది. కిట్టీతో పాటు నిర్వహించే చిన్న చిన్న చిట్టీలు కుటుంబాల అవసరాలకు కొంతమేర ఆర్థిక భరోసాను అందిస్తున్నాయి. సరదాగా మొదలైన ఈ కిట్టీలు స్వరూపం మార్చుకొని, ఆర్థిక మానవ సంబంధాల వేదికగా నిలుస్తున్నాయి. ఇప్పుడు నగరంలో అన్ని కాలనీల్లో మహిళా కిట్టీ పార్టీలు సర్వసాధారణం అయ్యాయి.

**కిట్టీ అంటే కేవలం డబ్బుల వ్యవహారం కాదు..**

కిట్టీ పార్టీకి మరో ప్రత్యేకత ఉంది. రోజంతా ఇంటి పనులు, కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉండే మహిళలకు కొంత సమయం తమ కోసం కేటాయించుకునే అవకాశం లభిస్తోంది. కిట్టీ నిర్వహించే ఇంట్లో ప్రత్యేక వంటకాలు తయారు చేసుకోవడం, అందరూ కలిసి భోజనం చేయడం, చిన్నచిన్న ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించడం సాధారణంగా మారింది. కొన్ని గంటల పాటు ఇంటి బాధ్యతలను పక్కనపెట్టి స్నేహితులతో సరదాగా గడపడం ద్వారా మానసికంగా కొంత ఉపశమనం పొందుతున్నామని పలువురు మహిళలు భావిస్తున్నారు. అందుకే కిట్టీని కేవలం పార్టీగా కాకుండా.. తమకు తాము కేటాయించుకునే ఆనంద సమయంగా చూస్తున్నారు.

**బంధాలకు కొత్త వేదిక..**

కిట్టీ పార్టీల ద్వారా ఒకే కాలనీ లేదా సొసైటీలో నివసించే మహిళల మధ్య పరిచయాలు పెరుగుతున్నాయి. ఒకరి కుటుంబ పరిస్థితులు, సమస్యలు, అభిప్రాయాలను మరొకరు తెలుసుకునే అవకాశం లభిస్తోంది. అవసరమైనప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకునే స్థాయికి ఈ పరిచయాలు బలపడుతున్నాయి. ఒంటరితనం, కుటుంబ బాధ్యతల ఒత్తిడి వంటి వాటి మధ్య మహిళలకు స్నేహితుల సమూహం ఒక మద్దతుగా నిలుస్తోంది. సంతోషాలను పంచుకోవడంతో పాటు కష్టాల్లోనూ పరస్పరం అండగా నిలిచే బంధాలు ఏర్పడుతున్నాయి.

**కిట్టీ నుంచి పర్యాటక యాత్రల వరకు..**

కిట్టీ గ్రూపులు కేవలం నెలవారీ సమావేశాలకే పరిమితం కావడం లేదు. కొందరు మహిళలు సమూహంగా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఒకరోజు విహారయాత్రలు, దేవాలయ దర్శనాలు, ప్రకృతి అందాలను ఆస్వాదించే పర్యటనలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో కిట్టీ గ్రూపులు మహిళల మధ్య స్నేహాన్ని మరింత పెంచడంతో పాటు కొత్త ప్రదేశాలను కలిసి సందర్శించే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నాయి.

**నగరాల్లో పెరుగుతున్న కిట్టీ కల్చర్..**

వరంగల్, హనుమకొండ వంటి పట్టణాల్లో కిట్టీ కల్చర్ క్రమంగా విస్తరిస్తోంది. దాదాపు ప్రతి కాలనీలోనూ మహిళలు తమ స్నేహితులు, పొరుగువారు, బంధువులతో కలిసి కిట్టీ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభమైన ఈ వ్యవస్థ కొన్ని గ్రూపుల్లో పెద్ద మొత్తాల వరకు చేరుతోంది. ఒక కాలనీలో పది కుటుంబాలు.. మరోచోట ఇరవై కుటుంబాలు.. ఇలా అనేక గ్రూపులు కొనసాగుతుండటంతో నగర స్థాయిలో చూస్తే కిట్టీల ద్వారా ప్రతి నెలా లక్షల రూపాయల మేర నగదు చలామణి జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్ద సంఖ్యలో గ్రూపులు ఉండటంతో మొత్తంగా ఇది కోట్ల రూపాయల స్థాయిలో చిన్న ఆర్థిక చలామణికి కారణమవుతున్న వ్యవస్థగా మారుతోంది.

**సరదా వెనుక.. ఒక చిన్న ఆర్థిక బలం**

కిట్టీ పార్టీకి బయటకు కనిపించేది నవ్వులు, ఆటలు, వంటకాలు, స్నేహం. కానీ దాని వెనుక మహిళల పొదుపు, పరస్పర విశ్వాసం, ఆర్థిక అవసరాలకు తాత్కాలిక అండ, సామాజిక సంబంధాల బలోపేతం వంటి అనేక అంశాలు ఉన్నాయి. అందుకే మధ్యతరగతి మహిళల జీవితాల్లో 'కిట్టీ.. చిట్టీ' ఒక చిన్నపాటి ఆర్థిక వ్యవస్థగా, మరోవైపు బంధాలను కలిపే సామాజిక వేదికగా రూపుదిద్దుకుంటోంది. ఇంటి నాలుగు గోడలకే పరిమితమయ్యే మహిళలకు కొంత వినోదాన్ని, కొంత ఆర్థిక వెసులుబాటును, మరికొంత స్నేహాన్ని అందిస్తున్న ఈ కిట్టీ కల్చర్ పట్టణ జీవనశైలిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది.

### ఒకచోట చేరి.. ఒకరికి ఒకరుగా..

**ప్రధానంగా ఒక కాలనీ, అపార్ట్‌మెంట్ లేదా సొసైటీలోని 10 నుంచి 20 కుటుంబాలకు చెందిన మహిళలు కలిసి కిట్టీ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతి నెలా ఒక్కొక్కరు నిర్ణీత మొత్తాన్ని చిట్టీ రూపంలో జమ చేస్తారు. సాధారణంగా రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. నెల మొదటి వారంలో అందరూ కలిసి డ్రా నిర్వహించి, ఆ నెలలో ఒకరికి మొత్తం అందజేస్తారు. డబ్బులు అందుకున్న కుటుంబం తదుపరి నెల కిట్టీ పార్టీకి ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ఇలా నెలనెలా ఒక కుటుంబానికి మొత్తం అందుతుండటంతో చిన్నచిన్న ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఈ చిట్టీ కొంత వెసులుబాటును కల్పిస్తోంది. ఇంటి అవసరాలు, పిల్లల చదువులు, చిన్నపాటి కొనుగోళ్లు, అత్యవసర ఖర్చులు వంటి వాటికి ఈ మొత్తం ఉపయోగపడుతోంది.**

## మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన

**అక్షరశక్తి, హనుమకొండ:** మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిలుపునిచ్చారు. 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో వాలంటీర్లు స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కళాశాల నుంచి హంటర్ రోడ్ మీదుగా భద్రకాళి బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులు, ప్రజలకు మట్టి విగ్రహాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, సింథటిక్ రంగులతో తయారు చేసిన విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేస్తాయని, మట్టి విగ్రహాలు పర్యావరణహితమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీలత మాట్లాడుతూ ప్రకృతిని ప్రతి ఒక్కరూ కాపాడాలని, అప్పుడే ప్రకృతి మనలను



కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమ వేముల, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల తయారీపై వర్క్‌షాప్



**అక్షరశక్తి,హనుమకొండ:** సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ అండ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డా. మంజుల సాగంటి తెలిపారు. ఐదేళ్లు పైబడిన చిన్నారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని, వినాయక విగ్రహాల తయారీకి అవసరమైన మట్టిని అకాడమీనే సమకూరుస్తుందని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. నాలుగేళ్లుగా చిత్రకళకు అంకితమై చిన్నారుల్లోని కళా నైపుణ్యాలను వెలికితీస్తూ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. మట్టి విగ్రహాల తయారీ ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా చూసే అలవాటును చిన్నారుల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డా. మంజుల సాగంటి తెలిపారు. గతేడాది కూడా మట్టి వినాయకులు, మట్టి దుర్గామాత విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌లు నిర్వహించగా, పలువురు చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ సామాజిక మార్పు కోసం కృషి చేస్తామని తెలిపారు. పిల్లల్లో శిల్పకళా నైపుణ్యాలను పెంపొందించేలా తల్లిదండ్రులు, పెద్దలు వారిని ప్రోత్సహించాలని కోరారు.

## వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి




**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో యువత, ముఖ్యంగా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఆమె అన్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, దేశాభివృద్ధి పట్ల నిబద్ధతను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి విద్యార్థి తన వంతు బాధ్యతను గుర్తించి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ చందర్ డాక్టర్ రమేష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టులు తీవ్రంగా ఖండిస్తున్నాం

**అక్షరశక్తి,హనుమకొండ:** విద్యార్థి నాయకులను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్ అన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ప్రశ్నిస్తున్న నాయకులను పోలీసులతో అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని సుమన్ హెచ్చరించారు.





## మట్టి గణపతుల వినియోగంతో కాలుష్యానికి చెక్

**అక్షరశక్తి, మహబూబాబాద్, సెప్టెంబర్ 11 :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పట్టణంలోని నెహ్రూ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్‌లలో ప్రజలకు మట్టి విగ్రహాలను అందజేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించాలని అధికారులు సూచించారు. మట్టి విగ్రహాలతో నీటి వనరుల కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రకృతి పరిరక్షణకు ప్రజలు తమ వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్, కమిషనర్ ఎం. వినోద్‌కుమార్, కౌన్సిలర్లు అజయ్ సారథిరెడ్డి, బోడా రవికుమార్, ముత్యం వెంకన్న, చిదురాల అరుణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, దండే శ్రీహరి, డీఎంసీ విజయ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## యువతే దేశ నిర్మాణానికి చోదకశక్తి



**అక్షరశక్తి, నర్సంపేట:** జయముఖి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027' అవగాహన సదస్సు, క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎన్‌ఎస్‌ఎస్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మై భారత్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వాసుదేవమూర్తి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. 'వికసిత్ భారత్ @2047' లక్ష్య సాధనలో విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలతో భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపు శ్వేత మాట్లాడుతూ 15 నుంచి 29 ఏళ్ల యువతలో ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి విద్యార్థులు ఎంపికయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్మత్త భైరవ ఆలయంలో మహా పాలాభిషేకం

**అక్షరశక్తి, హనుమకొండ:** పద్మాక్షి రోడ్ మారుతిహిల్స్‌లోని శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయంలో శుక్రవారం శ్రావణమాస ముగింపు, పొలాల అమావాస్య సందర్భంగా మహా పాలాభిషేకం నిర్వహించారు. భక్తులు 108 లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి, స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరభద్రనాథ్ మాట్లాడుతూ పొలాల అమావాస్యకు విశిష్టత ఉందన్నారు. భక్తులు కూష్మాండ దీపం, మిరియాల దీపం, నారికేళ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, మహాహారతి, అన్నదాన కార్యక్రమాలను దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.



# అసెంబ్లీలో న్యాయం జరగట్లేదు..

- అందుకే ఢిల్లీలో ఫిర్యాదు చేశాం
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు



**అక్షరశక్తి, డెస్క్ :** అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అసెంబ్లీ గేటు వద్ద రసాభాస జరిగింది. ఈ సంఘటన కౌరవసభను తలపిస్తోంది. మహిళా ఎమ్మెల్యేల జుట్టుపట్టుకుని లాగారు. పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారు. పోలీసుల గొడవల్లో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కింద పడిపోయారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న మమ్మల్ని అసెంబ్లీ లోపలికి ఎందుకు అనుమతించలేదు. కనీసం మహిళా ఎమ్మెల్యేలనైనా అనుమతించమని అడిగితే పోలీసులు వినిపించుకోలేదు. ముఖ్యమంత్రే మాపై దాడికి ఆదేశాలు జారీచేశారని నేను నమ్ముతున్నానను' అని సబిత పేర్కొన్నారు. 'అసెంబ్లీ సమావేశంలో అయినా మాపై జరిగిన దాడి గురించి చర్చ జరుపుతారనుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి, డీజీపీ ఈ సంఘటన గురించి మాట్లాడుతారని అనుకున్నాం. కానీ ఎవరూ నోరు మెదపలేదు. మాపై దాడిచేసి, మాపైనే కేసులు పెట్టారు. ఎమ్మెల్యేలు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు చేశారు. స్పీకర్‌ను మా ఎమ్మెల్సీ ఏమో అన్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటిపైకి చావుడప్పు కొట్టమని మనుషుల్ని పంపారు. ఇవన్నీ సీఎం డైరెక్షన్‌లోనే నడిచాయి. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడులకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. మాకు జరిగిన అవమానాన్ని సభలో చెప్పుకునేందుకూ అవకాశమివ్వలేదు. మాకు అసెంబ్లీలో న్యాయం జరగలేదు.. అందుకే ఢిల్లీకి వచ్చాం. ఇది ముఖ్యమంత్రి సిగ్గుపడాల్సిన విషయం' అని సబిత మండిపడ్డారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సబిత అన్నారు. ఇంతవరకూ హామీలను నెరవేర్చలేదని ఎమ్మెల్యే విమర్శించారు. 22ఏ కింద కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టి కాంగ్రెస్ భూదందాకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై అసెంబ్లీ సాక్షిగా దాడులు చేశారని ధ్వజమెత్తారు. మహిళా కానిస్టేబుళ్లను ముందుపెట్టి శిఖండి రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహూల్ గాంధీ స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని సోనియా, రాహుల్ దృష్టికి తీసుకెళ్తామని, వారికి లేఖలు కూడా రాస్తున్నామని ఎమ్మెల్యే సబిత తెలిపారు.

# సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని రాంచందర్‌రావు చెప్పారు. ఈ మేరకు సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ప్రయోజనాలను నేరుగా అందిస్తున్నామని ఆయన వివరించారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విస్తరణతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో కీలక స్థానాన్ని సాధించిందన్నారు.

పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. అభియాన్‌లో భాగంగా మేరే సప్నో కా భారత్, సేవా కీ కహానీ, సేవా జ్యోతి కలశ్ యాత్ర, సుశాసన్ సేవా సంవాద్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సేవ, సుశాసనం, ప్రజా సంక్షేమం అనే స్ఫూర్తితో మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యమని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# విద్యుత్ పొదుపు పాటించాలి

- విద్యుత్ ఉత్పత్తి తగ్గినా సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు
- డైరెక్టర్ ఆపరేషన్ టి. మధుసూధన్



**అక్షరశక్తి,స్టేషన్ ఘనపూర్:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గి, ఎండల తీవ్రతతో వినియోగం పెరిగినప్పటికీ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్/ఆపరేషన్ టి. మధుసూధన్ తెలిపారు. శుక్రవారం చిల్పూర్ మండలం రాజవరం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంతో పాటు చిన్నపెండ్యాల, మల్కాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో డీఈ ఆపరేషన్ ఘనపూర్ బి. సారయ్యతో కలిసి విద్యుత్ సరఫరా విధానాన్ని పరిశీలించారు. సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తున్నామని, నూతన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఓవర్‌లోడ్, లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించి పొదుపులో సహకరించాలని మధుసూధన్ కోరారు. నూతన సాంకేతిక పద్ధతులతో విద్యుత్ అంతరాయాలను తగ్గిస్తున్నామని, త్వరితగతిన సమస్యల పరిష్కారం కోసం మానవరహిత సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది వన్ మినిట్ రూల్‌ను పాటిస్తూ మొబైల్ యాప్ ద్వారా ఎల్సీలు తీసుకుని సురక్షితంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఈ పి. రణధీర్ రెడ్డి, ఏఈలు ఆర్. సురేష్, శ్వేత, పి. శంకర్, శివకుమార్, ఎస్ఎల్ఐ నీలం ఐలేష్, ఎల్ఐ జి. కృష్ణంరాజు, ఆర్టిజన్ ఎం. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం

- నిలిచిపోయిన సేవలు
- సమ్మె ప్రభావంతో జనం అవస్థలు




**అక్షరశక్తి, హనుమకొండ:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా హనుమకొండ, వరంగల్‌లో ఉద్యోగులు విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున సమ్మె చేపట్టారు. నల్ల బ్యాడ్జీలతో ఆందోళనలో పాల్గొన్నారు. న్యాయమైన తెమ్మ డిమాండ్లు పరిష్కరించాలని కదం తొక్కారు వరంగల్ ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొని తమ ఐక్యతను, పోరాట స్ఫూర్తిని చాటారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు బ్యాంకింగ్ రంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానంలో తగిన మార్పులు చేయాలని కోరారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు, పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని ఉద్యోగులు నినదించారు. ఉద్యోగుల హక్కులను కాపాడటంతో పాటు ప్రజా బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారుల సంఘం డీజీఎస్ వై. ప్రవీణ్ కుమార్, అవార్డు స్టాఫ్ డీజీఎస్ సి.హెచ్. సంతోష్ కుమార్, ఓబీసీ డీజీఎస్ రాజనీకాంత్, సేవా డీజీఎస్ రమణ్ణతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.


**సమ్మె ఎఫెక్ట్**

బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగడంతో శుక్రవారం బ్యాంకింగ్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. బ్యాంకు శాఖల్లో నగదు ఉపసంహరణ, డిపాజిట్లు, ఇతర లావాదేవీల కోసం వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఏటీఎంలు కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యవసర నగదు అవసరాలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికితోడు శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా సెలవులు రావడంతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో నగదు లావాదేవీలు, ఇతర బ్యాంకింగ్ అవసరాల కోసం ప్రజలు మరికొంతకాలం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

# కేయూలో వరుస దొంగతనాలు..

- భద్రతపై ప్రశ్నలు
- డెవలప్‌మెంట్ ఆఫీస్‌లో చోరీకి యత్నం







**అక్షరశక్తి, కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో మరోసారి దొంగతనం ఘటన కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి సమయంలో యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీస్‌లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని పరిశీలించిన అధికారులు ఈ విషయాన్ని కేయూ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఫింగర్ ప్రింట్స్, ఇతర ఆధారాలను సేకరించారు. కార్యాలయంలోని కొన్ని వస్తువులను చిందరవందర చేసినప్పటికీ, ఎలాంటి వస్తువులు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించలేదని అధికారులు చెబుతున్నారు. అయితే యూనివర్సిటీలో గతంలోనూ పలు చోరీ ఘటనలు చోటుచేసుకోవడంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో న్యూ పీజీ హాస్టల్‌లో ఫ్యాన్లు చోరీకి గురైనప్పటికీ ఇప్పటివరకు వాటి ఆచూకీ, రికవరీపై స్పష్టత లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. అలాగే కేయూ ఆడిటోరియంలో ఏసీలకు సంబంధించిన గ్యాస్ పైపులు, కాపర్ వైర్లు అపహరణకు గురైన ఘటనలోనూ ఇప్పటివరకు రికవరీ జరగలేదని చెబుతున్నారు. కేయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు ప్రొజెక్టర్లు మాయమైన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీలో వరుసగా చోరీ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థపై విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? సెక్యూరిటీ గార్డులు, నైట్ పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. వరుస చోరీల నేపథ్యంలో ఇవి బయటి వ్యక్తుల పనా? లేక యూనివర్సిటీ అంతర్గత వ్యవస్థపై అవగాహన ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణంలోనూ విచారణ జరపాలని విద్యార్థులు కోరుతున్నారు.

# మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి




**అక్షరశక్తి, హనుమకొండ:** పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించాలని అక్షరశక్తి ఎండీ డాక్టర్ పల్లె రవి వంశీ వంశీ మోహన్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని ఆయన అన్నారు. ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల మట్టి గణపతి మహా గణపతి పర్యావరణ అవగాహన కార్యక్రమం ఐదో రోజు కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా అక్షరశక్తి కార్యాలయాన్ని సందర్శించిన నిమ్మల శ్రీనివాస్, సంస్థ ఎండీ డాక్టర్ వంశీకి మట్టి గణపతి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే ప్రతిమల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని, అందువల్ల పర్యావరణహితమైన మట్టి గణపతుల వైపు ప్రజలు మొగ్గుచూపాలని సూచించారు. గత 15 సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న నిమ్మల శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా డాక్టర్ వంశీ అభినందించారు. సమాజం, పర్యావరణం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నగర ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ... తాను చేపడుతున్న సామాజిక, పర్యావరణ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్న పత్రికా యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా నగరంలో అనేక చోట్ల పంపిణీ చేస్తున్నారని ప్రతిమలు కావాల్సిన వారు 9949709866 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

## మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి

**ఎల్బీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల అవగాహన ర్యాలీ**



**అక్షరశక్తి, హనుమకొండ:** మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని లాల్‌బహదూర్ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ 10వ తెలంగాణ బెటాలియన్ క్యాడెట్లు పిలుపునిచ్చారు. 'మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాడెట్లు నల్లమట్టిని సేకరించి స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను వదిలేద్దామని, నీటి కాలుష్యాన్ని నివారించి జీవరాశులను కాపాడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించాలని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి. హేరావు క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, బానోత్ రాకేష్, రక్షిత్, శ్రీచరణ్, గోపు హేమంత్, ఇర్ఫాన్, మహేశ్వరి, శ్రద్ధ, భాను, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్టా ఎన్నికలు నిర్వహించాలి

**కేయూ రిజిస్ట్రార్‌కు పార్ట్‌టైం అధ్యాపకుల వినతి**

**అక్షరశక్తి, హనుమకొండ:** కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (కుప్టా) ఎన్నికలు వెంటనే నిర్వహించాలని వివిధ విభాగాల పార్ట్‌టైం అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రానికి వినతిపత్రం అందజేశారు. గత కమిటీ రద్దయి కొన్ని సంవత్సరాలు గడిచినా కొత్త కమిటీ ఏర్పాటు కాలేదని అధ్యాపకులు తెలిపారు. యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 150 మందికిపైగా పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు కమిటీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రిజిస్ట్రార్ గతంలో జరిగిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి తదనుగుణంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం

**నల్సా పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన**



**అక్షరశక్తి, మహబూబాబాద్:** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజ్‌కృష్ణ తెలిపారు. సమగ్ర శిక్ష-సమ్మిళిత విద్య విభాగం ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లోని పేరాల కట్టయ్య ఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు శుక్రవారం జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కృష్ణ మాట్లాడుతూ నల్సా అమలు చేస్తున్న మానసిక, మేధోపరమైన వైకల్యాలు కలిగిన వారికి ఉచిత న్యాయ సహాయ పథకం, సంక్షేమ పథకాలు, బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై వివరించారు. న్యాయపరమైన సలహాలు, సహాయం కోసం జాతీయ ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజర్ వి. సురేష్, జిల్లా సైన్స్ అధికారి, ఇన్‌చార్జి డీఈవో ఎం. శ్రీరాములు, సిబ్బంది, ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉండి సమస్యలు సాధించుకుందాం

**పొదుపుతో ఆర్థిక భరోసా**



**అక్షరశక్తి, ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు ఐక్యంగా ఉండి సమస్యల సాధనకు కృషి చేయాలని పవర్ ఆఫ్ ప్రింట్ మీడియా ఆత్మీయ వేదిక నిర్ణయించింది. శుక్రవారం గట్టమ్మ దేవాలయం వద్ద భేతి సతీష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పాత్రికేయుల ఆర్థిక అవసరాలకు తోడ్పడేలా పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రతి నెల సభ్యులు పొదుపు చేయాలని నిర్ణయించారు. ప్రింట్ మీడియా పాత్రికేయులకు ప్రత్యేకంగా సమావేశ సమయం కేటాయించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో సుంకర సంపత్, గుర్రపు శ్రీధర్, కే. రాజిరెడ్డి, గూడారు మహిపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- ప్రతిష్టించే విగ్రహాల ఎత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మట్టి విగ్రహాల నిమజ్జనం చాలా సులువు
- తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేయాలి
- వీలైనంత త్వరగా వినాయకులను నిమజ్జనంకి తీసుకరావాలి
- ట్రాఫిక్ సమస్య తలేత్తకుండ ఉండేందుకు సహకరించండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- నగరంలోని చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన





**అక్షరశక్తి,హన్మకొండ :** గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం,చిన్న వడ్డే పల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్, కలెక్టర్లు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులు, గుండం వద్ద ఎన్ని వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందో, గతంలో ఆయా ప్రాంతాల్లో ఎన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారని అధికారులను పోలీస్ కమిషనర్, కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. బంధం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చెరువులు, గుండంలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన తగిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు. చెరువు కట్ట వద్ద అవసరమైన మేరకు చదును చేసే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు బాగుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాల సంఖ్య, పరిమాణం, నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలపై ముందస్తు అంచనా వేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికం గానే నిమజ్జనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. నవరాత్రులు పూర్తి కాగానే... తొందరగా వినాయకులను కదిలించి...నిమజ్జనం కి తరలించాలన్నారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రవికుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, సాగునీటిపారుదల శాఖ అధికారులు కిరణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్వో డాక్టర్ రాజేష్, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహన్, మైనింగ్ ఏడీ రామాచారి, కాజీపేట తహసీల్దార్ రాజు, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, సత్యనారాయణ, కాజీపేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైన కవలలు





**అక్షరశక్తి, కాజీపేట :** రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు హనుమకొండలోని సెయింట్ పీటర్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న పోలేపాక విల్ ఉన్నవ్, పోలెపాక విష్ ఉన్నవ్ అనే ఇద్దరు కవలలు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ బాలుర విభాగం రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే హనుమకొండ జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఈనెల మూడవ తేదీన జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో హనుమకొండ జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పిల్లి సాంబశివరావు, తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికలో ఆ కవలలు ఇద్దరు అత్యద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనడానికి ఎంపికైన ఆ కవలలను, రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యేలా శిక్షణ ఇచ్చిన కోచ్ వినయ్ ని సెయింట్ పీటర్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, అభినందించారు. ఆ పోటీల్లో పాల్గొనడానికి కాజీపేట జంక్షన్ నుంచి శుక్రవారం సాయంత్రం భాగ్యనగర్ ఎక్స్ప్రెస్ లో బయలుదేరిన హనుమకొండ జిల్లా జట్టుకు అభినందనలు తెలిపిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు తల్లిదండ్రులు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి**




**అక్షరశక్తి, మహబూబాబాద్:** తెలంగాణలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ (టీయూసీఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో జరిగింది.
ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గుర్తింపు లేకుండా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ప్రయోజనాలు అందించాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి వినియోగించాల్సిన రూ.674 కోట్ల నిధులను రాష్ట్రంలోని 65 ఐటీఐలను 10 ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చేందుకు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం కార్మిక ద్రోహమన్నారు. 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.9 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికంటి వెంకన్న అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, నాయకులు ఏరుగొండ కొమురయ్య, పి. రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా నిలిచిన బ్యాంకింగ్ సేవలు

**పెండింగ్‌లో 4 లక్షల కోట్ల విలువైన చెక్కులు**




**అక్షరశక్తి, డెస్క్:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో కోట్లాది మంది కస్టమర్లు ఇబ్బందిపడుతున్నారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ల ఆధ్వర్యలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. బ్రాంచ్ ఆపరేషన్స్, క్యాష్ డిపాజిట్స్, విత్రడాల్స్, చెక్కు క్లియరెన్సులు నిలిచిపోయాయి. ఉద్యోగులతో పాటు ఆఫీసర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. చాలా వరకు పబ్లిక్ రంగ బ్యాంకులను మూసివేశారు. యూఎఫ్‌బీయూ గ్రూపులో మొత్తం 9 ఉద్యోగ సంఘాలు ఉన్నాయి, ఇక పబ్లిక్ రంగ బ్యాంకుల్లో సుమారు 8 లక్షల మంది వర్కర్లు ఉన్నట్లు తెలుస్తోంది. బ్యాంకుల మూసివేతతో ఎక్కడిక్కడ చెక్కులు నిలిచిపోయాయి. సుమారు 4 లక్షల కోట్ల మేర విలువైన చెక్కులను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. క్యాష్‌ట్రాన్సాక్షన్స్, బిల్ ట్రేడింగ్, బిల్ డిస్కౌంట్ , ట్రేడ అంశాల్లో లావాదేవీలు స్తంభించాయి. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ అన్ని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోని ట్రెజరీ ఆపరేషన్స్ నిలిపివేసినట్లు చెప్పారు మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఏటీఎంల్లో నగదు నిండుకున్నది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీ, యాక్సిస్ లాంటి బ్యాంకుల్లో ఇవాళ సేవలు కొనసాగాయి. ఆ బ్యాంకుల ఉద్యోగులు ఏ సంఘంలో లేరు. డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐలు అభ్యంతరం లేకుండా పనిచేస్తున్నాయి. నెలలో ప్రతి శనివారం కూడా హాలీడే ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు పని సమయాన్ని అదనంగా 40 నిమిషాలు పెంచాలని, ప్రతి శనివారాన్ని హాలీడేగా ప్రకటించాలని కోరుతూ 2023 డిసెంబర్‌లో అధికారులకు అభ్యర్థన సమర్పించినట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ జనరల్ సెక్రటరీ రూపమ్ రాయ్ తెలిపారు.

# ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన

- సదస్సులో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**అక్షరశక్తి,వరంగల్:** ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించే లక్ష్యంతో గీసుకొండ మండలం కోనాయమాకుల రైతు వేదికలో శుక్రవారం జిల్లా స్థాయి ఉద్యాన పంటల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులతో మాట్లాడి ఉద్యాన పంటల సాగు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పంటల ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు.
ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందేలా అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ సూచించారు. రైతుల సందర్శనార్థం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, వాటి ఉపయోగం, వినియోగించే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.
ఈ అవగాహన సదస్సులో ఆర్డీవో సుమ, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.